క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: బాచుపల్లి ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని బాచుపల్లి సెక్షన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ నిజాంపేట్, ఎస్ఎంఎస్, ఎస్ఎల్‌జీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బాచుపల్లి పోలీస్‌స్టేషన్ ఏరియా, తహసీల్దార్ కార్యాలయం, బాచుపల్లి గ్రామం, బాచుపల్లి సిగ్నల్స్ నుంచి శ్రీకర్ విల్లాస్ వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొంపల్లి ఫీడర్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: విద్యుత్ లైన్ల రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి సబ్‌స్టేషన్ ఏఈ వినాయక్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ కొంపల్లి ఫీడర్ పరిధిలోని సెంట్రల్ పార్క్, కుమ్మరి బస్తీ, ఆంధ్ర బస్తీ, కొంపల్లి మున్సిపల్ కార్యాలయ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలి



ఔట్‌సోర్సింగ్ కార్మికులకు మద్దతు తెలుపుతున్న బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్: ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పర్మనెంట్ చేయాలని గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్లకు చెందిన కార్మికులు మంగళవారం సర్కిల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఎన్నికల హామీలను నెరవేర్చాలని.. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. వారికి బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి, నాయకులు గడ్డం రాజేందర్‌రెడ్డి, నార్లకంటి దుర్గయ్య, ప్రతాప్, ప్రభాకర్‌రెడ్డి, శంకర్, శ్రవణ్ తదితరులు సంఘీభావం తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

దుండిగల్: ఆలయాల అభివృద్ధికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ నేత, దుండిగల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. డి.పోచంపల్లి డాక్టర్ బస్తీలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.51 వేలను విరాళంగా అందజేశారు. భవిష్యత్‌లోనూ తన సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు మహేందర్‌యాదవ్, సాయియాదవ్, భరత్‌కుమార్, నేతలు శివయాదవ్, శ్రీకాంత్, వీరేందర్, లింగంగౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఆకలి తీర్చుకుందామని వెళ్తే ప్రాణం పోయింది'

విద్యుదాఘాతంతో గేదె మృతి



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన గేదె

కుత్బుల్లాపూర్: విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా ఓ మూగ జీవి ప్రాణాన్ని కోల్పోయింది. గాజులరామారం సబ్‌స్టేషన్ పరిధిలోని చింతల్ వివేకానంద్‌నగర్ కాలనీలోని రోడ్ నం.6లో ఉన్న కమ్యూనిటీహాల్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగడంతో విద్యుదాఘాతానికి గురై ఓ గేదె మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉండటమే కాకుండా దానికి రక్షణ కంచె లేదు. అక్కడే చెత్తతో ఆహార వ్యర్థాలను వేస్తున్నారు. తినడానికి అటుగా వచ్చిన గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందిందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బీసీలకు రాజ్యాధికారం కాంగ్రెస్‌తోనే సాధ్యం

కుత్బుల్లాపూర్: బీసీలకు రాజ్యాధికారం కాంగ్రెస్‌తోనే సాధ్యమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నాయకుడు గుంజ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌కు తరలి వెళ్లి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం షాపూర్‌నగర్‌లోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్యగౌడ్ అధ్యక్షత ఏర్పాటు చేసిన సమావేశంలో గుంజ శ్రీనివాస్ మాట్లాడారు. ఇప్పటి వరకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం వహించని వడ్డెర సామాజికవర్గానికి చెందిన తనకు అవకాశం కల్పించాలన్నారు. తాము గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తు వస్తున్నానని పేర్కొన్నారు.



కాంగ్రెస్ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకుంటున్న గుంజ శ్రీనివాస్

సార్లు ఎంక్వైరీకి.. వినతులు గాలికి!

- వెలవెలబోతున్న తహసీల్దార్ కార్యాలయం
- అధికారులు, సిబ్బంది సర్వేలో బిజీ
- ధ్రువపత్రాల కోసం వచ్చే జనానికి తప్పని ఇబ్బందులు
- ఖాళీ పోస్టులను భర్తీ చేస్తే ఇలాంటి సమయంలో ఇబ్బందులు తలెత్తవంటున్న ప్రజలు



గాజులరామారంలోని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం, (ఇన్‌సెట్‌లో) జనాలు లేక వెలవెల

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు సిబ్బంది వివిధ పథకాల ఎంక్వైరీలో నిమగ్నం అవ్వగా కొన్ని రోజులుగా కార్యాలయంలోని ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. అత్యధిక జనాభా కలిగిన కుత్బుల్లాపూర్ ప్రాంతంలో వివిధ పనుల నిమిత్తం ప్రతినిత్యం వందలాదిమంది కార్యాలయానికి వస్తుంటారు. అధికారులు లేకపోవడంతో పనులు కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

◆ సర్వేలో అధికారులు ..

ఎన్నికల ఓటర్ లిస్ట్, 59 జీవో, గృహలక్ష్మి పథకం, డబుల్ బెడ్ రూమ్ కింద దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటా ఎంక్వైరీ నేపథ్యంలో అధికారులు బిజీగా మారారు. దీంతో కార్యాలయంలో సిబ్బంది లేకపోవడం, కార్యాలయానికి వచ్చే వారికి సకాలంలో పనులు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సర్వే అనంతరం సాయంత్రం వేళలో కార్యాలయానికి వచ్చిన అధికారుల ముందు కుప్పలుకుప్పలుగా ఫైల్ ఉండటంతో సమయం లేక హైరానా పడుతున్నారు.

◆ సిబ్బంది కొరత...

ఉన్న సిబ్బంది సర్వేలకు పోవడంతో నిత్యం జనంతో ఉండే కార్యాలయం కొన్ని రోజులుగా వెలవెలబోతోంది. గతంలో కార్యాలయంలో 6 మంది వీఆర్వోలు, పది మంది వీఆర్ఏలు ఉండేది. అప్పట్లో ఏదైనా విచారణ చేపట్టాలంటే వీఆర్ఏ, వీఆర్వోలు ఉండేవారు. ప్రస్తుతం ఆ వ్యవస్థను రద్దు చేయడంతో కార్యాలయంలో ఏది చేయాలన్నా అధికారులపైనే భారం పడుతోంది. దీనికి తోడుగా సీనియర్ అసిస్టెంట్, ఆర్ఐ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఉన్న కొంతమంది సిబ్బందిపై పని భారం మరింత ఎక్కువవుతోంది. దీంతో సకాలంలో పనులు జరగక కార్యాలయానికి వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయంలో ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతున్నారు.



ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు వివేకానంద్, అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌రావు మంగళవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

– కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ గాంధీభవన్‌లో మంగళవారం ఆయన దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే పార్టీని బలోపేతం చేశామన్నారు. తనకు అవకాశం కల్పిస్తే కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మిద్దెల యాదిరెడ్డి, బండి శ్రీనివాస్‌గౌడ్, బైరి ప్రశాంత్‌గౌడ్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుండిగల్ యువజన అధ్యక్షుడిగా సుమన్..

దుండిగల్ మున్సిపాలిటీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొంటు సుమన్ నియమితులయ్యారు.



దరఖాస్తు అందజేస్తున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి

ఆయనకు బౌరంపేటలోని పార్టీ కార్యాలయంలో నర్సారెడ్డి భూపతిరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. తనకు పదవి అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రవణ్‌రెడ్డి, భూపతిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



సీఎం సహాయనిధి చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గారు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన 39 మంది లబ్ధిదారులకు రూ.12 లక్షల 72 వేల విలువ చేసే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంళగళవారం శంబీపూర్ కార్యాలయంలో ఆయన అందజేశారు. అదే విధంగా ఐదుగురు పేదలు వైద్యం చేయించుకునేందుకు మంజూరైన రూ.7 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి దోహద పడుతోందన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందారన్నారు. అర్హులైన ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

◆ గాజులరామారం డివిజన్ పరిధి మల్లారెడ్డినగర్‌లో ఈ నెల 26వ తేదీన జరుగనున్న శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి



సూరారంకాలనీ 60ఫీట్స్ కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

రావాలని తెలంగాణ సాయి, ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. లక్ష్మారెడ్డి, వెంకటేశ్వరరావు, సుబ్బిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ సూరారం కాలనీ 60 గజాలకు చెందిన ప్రజలు మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో తమకు ఇళ్ల పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు ఇప్పించాలని ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజును కలిసి అభ్యర్థించారు. దీనిపై స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

అధికారుల డుమ్మాపై సీరియస్

సాక్షి,మేడ్చల్‌జిల్లా: జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా కొట్టడంపై జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ పాలనలో సామాన్యులకు భద్రత కరువు



జగద్గిరిగుట్ట సీఐను కలిసి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్న శ్రీశైలంగౌడ్



బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సామాన్యులకు భద్రత కరువైందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ కూన మహాలక్ష్మినగర్‌లో మద్యం మత్తులో అకారణంగా ఓ ఆటో డ్రైవర్ యాది అనే బాలుడి గొంతు కోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న శ్రీశైలంగౌడ్ మంగళవారం బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలుడి వైద్య చికిత్స ఖర్చు ప్రభుత్వమే భరించాలన్నారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం ఇవ్వడంతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇబ్బడిముబ్బడిగా మద్యం దుకాణాలకు అనుమతి ఇవ్వడంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. అనంతరం అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని జగద్గిరిగుట్ట సీఐను కలిసి కోరారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జేకే శేఖర్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు పున్నారెడ్డి, నాయకులు మేకల సురేష్‌రెడ్డి, అరుణారెడ్డి, మహేందర్, అరుణ్‌కుమార్, శ్రవణ్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

దుండిగల్: మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దే విధంగా పని చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి అన్నారు. మున్సిపల్ పరిధి మల్లంపేటలోని 24వ వార్డులో రూ.70లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ.. వార్డుల్లో సమస్యలు తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే అక్కడ మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. మంజూరైన పనులను త్వరతగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, అనంతస్వామి, మాదాసు వెంకటేశం, మహేందర్ యాదవ్, సాయియాదవ్, భరత్‌కుమార్, నేతలు ఆంజనేయులు, సుధాకర్‌రెడ్డి, రమేశ్, నర్సింహ, అమర్‌నాథ్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ కృష్ణవేణి

మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జయదర్శిని ఎన్‌క్లేవ్‌లో రూ.20 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్, సాయి కృప అపార్ట్‌మెంట్‌లో రూ.10 లక్షలతో బీటీ రోడ్డు, రూ.32లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్, అదే విధంగా ప్రజయ్ అపార్ట్‌మెంట్‌లో రూ.18 లక్షలతో నిర్మించనున్న కేఎల్ సంప్ వెల్ పనులకు మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరై చైర్మన్ శ్రీశైలంయాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ప్రతి కాలనీ, బస్తీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎన్ని నిధులు ఖర్చు అయినా వెనుకడుగు వేసేది లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనల వెల్లువ

◆ మూడోసారి ఎమ్మెల్యేగా పోటీ చేయనున్న వివేకానంద్‌కు బీఆర్ఎస్ శ్రేణుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. మంగళవారం నిజాంపేట్ కార్పొరేషన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఆగం పాండు, కార్పొరేటర్ ఇంద్రజిత్‌రెడ్డి, బౌరంపేట్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యేను కలిశారు.

సారూ.. జర ఈడ చూడు!

- సమస్యలు పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రంగారెడ్డినగర్: వాల్వ్‌ల లీకేజీలతో ప్రజలు సురక్షితమైన తాగునీటికి దూరమవుతున్నారు. కుత్బుల్లాపూర్ జలమండలి డివిజన్ పరిధిలో ప్రతినిత్యం ఏదో ఒక ప్రాంతంలో మ్యాన్‌వాల్వ్‌లు, పైపులైన్లకు లీకేజీలు తలెత్తి విలువైన తాగునీరు రోడ్డు పాలవడంతో పాటు ఇళ్లకు మురుగునీరు సరఫరా అవుతోంది. షాపూర్‌నగర్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం సమీపంలోని ప్రధాన రహదారిపై గత కొన్ని రోజులుగా మ్యాన్‌వాల్వ్‌కు లీకేజీ ఏర్పడి నీటి సరఫరా అయ్యే సమయాల్లో గంటల తరబడి నీటి వృథా కొనసాగుతోంది. సమీపంలోనే షాపూర్‌నగర్ జలమండలి డీజీఎం కార్యాలయం ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అసలే వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. లీకేజీకి మరమ్మతులు నిర్వహించి వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వాల్వ్ నుంచి లీకవుతున్న తాగునీరు

చెత్త సేకరణ పాయింట్ ఇక్కడా?



షాపూర్‌నగర్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని ఆనుకునే చెత్త సేకరణ పాయింట్

రంగారెడ్డినగర్: ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోనే చెత్త సేకరణ పాయింట్‌ను ఏర్పాటు చేయడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. షాపూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిని ఆనుకునే చెత్త సేకరణ పాయింట్‌ను నిర్వహిస్తున్నారు. స్థానికంగా చెత్తను సేకరించే పారిశుద్ధ్య సిబ్బంది చుట్టు పక్కల ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను డంప్ చేస్తున్నారు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులతో పాటు స్థానికంగా ఉన్న ఇళ్ల వాసులు చెత్త కంపును భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని చెత్త సేకరణ పాయింట్‌ను షాపూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో నుంచి మార్చాలని పలువురు కోరుతున్నారు.

ఫెన్సింగ్ వేయరు.. చెత్త వేయడం మానరు!



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని సాయిబాబా కల్యాణ మండపం వద్ద ప్రమాదకరమైన ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. దానికి తోడు స్థానిక ప్రజలు చెత్తను కూడా అదే చోట వేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ వేయడం లేదు. ప్రజలు చెత్త వేయడం మానడం లేదు. దీంతో చేసేదేమీ లేక జీహెచ్ఎంసీ సిబ్బంది చొరవ తీసుకొని ఇక్కడ చెత్త వేస్తే రూ.1000 ఫైన్ అంటూ ఓ బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఓటును వినియోగించుకోవాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ఓటును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి సూచించారు. జిల్లాలో ఎంతో చైతన్యం కలిగి ఉన్న వయోవృద్ధులు ఓటింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎలక్షన్ కమిషనర్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు స్వీప్ ప్రచారంలో భాగంగా సీనియర్ సిటిజెన్స్‌కు అవగాహన సమావేశం నిర్వహించారు. ఓటర్ల సౌకర్యార్థం ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు అనేక మార్పులు చేస్తూ పలు సదుపాయాలను అందుబాటులోకి తెస్తోందని ఆయన గుర్తుచేశారు. 80 ఏళ్ల పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటును వినియోగించుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. ఇంటి నుంచి ఓటు వేయాలనుకున్న వారు ఎన్నికల ప్రకటన వెలువడిన మీదట నిర్ణీత ఫారం నింపి తమ అభ్యర్థనను తెలియజేస్తే, పోలింగ్ అధికారి నేతృత్వంలోని సిబ్బంది వారి ఇంటి వద్దకు వచ్చి సీక్రెట్ బ్యాలెట్ విధానాన్ని అనుసరిస్తూ ఓటును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. వయోవృద్ధుల కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంప్, వీల్ చెయిర్ వంటి సదుపాయాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరు, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్‌ల పనితీరుపై అనుమానాలను నివృత్తి చేశారు. పలువురు సీనియర్ సిటిజెన్స్‌ను శాలువాతో సత్కరించారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాసమూర్తి, ఎలక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.